మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జనార్దన్, దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ సతీశ్

‘కోడ్’ సాకుతో హామీలకు ఎసరు

- లోక్‌సభ ఎన్నికలు జరిగేలోపు 6 గ్యారెంటీలను అమలుచేయాలి
- రాహుల్‌గాంధీది జోడో యాత్ర.. ఆ పార్టీ నాయకుల చోడో యాత్ర
- బెల్లంపల్లి సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మంచిర్యాల, జనవరి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఎగగొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లోపు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి వేముల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాదర్బార్‌లో ఒక్క రోజు అర్జీలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడూ పత్తా లేకుండా పోయాడని విమర్శించారు. గత ప్రభుత్వం అప్పులు చేసిందని విమర్శించిన కాంగ్రెస్.. తమ ప్రభుత్వం ఏర్పాటైన 50 రోజుల్లోనే రూ.14 వేల కోట్ల అప్పులు చేసిందని దుయ్యబట్టారు. ప్రజలను కేసీఆర్ కలవడం లేదని పనిగట్టుకొని విష ప్రచారం చేసిన మీడియా సంస్థలు ఇప్పుడు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 నుంచి వెంటనే ఇస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, రూ.4 వేల పింఛన్, రూ.2,500 మహాలక్ష్మి పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఇవేవీచేయకుండా పైసా ఖర్చు లేని ఉచిత బస్సు పథకాన్నే కాంగ్రెస్ అమలు చేస్తున్నదని విమర్శించారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర చేస్తుంటే ఇండియా కూటమిలోని నాయకులు ఒక్కొక్కరుగా ఛోడో యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో కర్ణాటకలో 22 ఎంపీ సీట్లలో సున్నా నుంచి రెండు సీట్లు మాత్రమే గెలుస్తాయని సర్వేలు చెప్తున్నాయని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్‌ను బొందపెట్టేవాడు ఇంకా పుట్టలేదని అన్నారు. బీఆర్‌ఎస్‌ను కనబడకుండా చేయడం నీ గురువైన చంద్రబాబు, నీ కంటే పెద్ద రెడ్డి రాజశేఖర్‌రెడ్డితోనే కాలేదన్నారు. తెలంగాణ ఉద్యమ బిడ్డలుగా రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టంచేశారు. మోదీ దోస్తు అదానీ కన్ను సింగరేణిపై పడిందని.. ఈ విషయంలో సింగరేణి కార్మికులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సంస్థను కాపాడుకోవాలంటే మీ కోసం పోరాటం చేసే బీఆర్‌ఎస్ ఎంపీలనే గెలిపించుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌ను బొందపెట్టుడు ఖాయం

- అభివృద్ధి పనులు చేస్తే అప్పులు కావా?
- సుదీర్ఘ కాంగ్రెస్ పాలనలో ఏం చేసింద్రు?
- ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- కాంగ్రెస్‌కు ‘మల్లన్న’ సినిమా చూపిస్తా
- రేవంత్‌పై మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫైర్
- కాంగ్రెస్‌వి 420 హామీలు: జగదీశ్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం ఆలియాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి శామీర్‌పేట కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్/శామీర్‌పేట, జనవరి 30: బీఆర్‌ఎస్‌ను బొందపెట్టడం కాదు.. త్వరలో రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొందపెట్టుడు ఖాయమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ధ్వజమెత్తారు. 56 ఏండ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఏమి ఉద్ధరించిందని ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తే అప్పులు కాకపోతే లంకెబిందెలు ఉంటయా? అని విరుచుకుపడ్డారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం ఆలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి శామీర్‌పేట కృతజ్ఞత సభలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని స్పష్టంచేశారు. అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడటంపై మండిపడ్డారు. మాయమాటలు, మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టడానికే సీఎం, మంత్రులు పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. కేంద్రం సహకరించకున్నా తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కష్టపడ్డదని చెప్పారు. హైదరాబాద్‌ను అమెరికా తరహాలో తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌కే దక్కుతుందని స్పష్టంచేశారు. రేవంత్‌కు దమ్ముంటే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సవాల్ విసిరారు. ప్రజలను మోసం చేసే కాంగ్రెస్ నాయకులకు ‘మల్లన్న’ సినిమా చూపిస్తానని చురకలంటించారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ పుణ్యాన వారికి పదవులు : జగదీశ్‌రెడ్డి

కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించకుంటే కాంగ్రెస్ వారికి పీసీసీ పదవులు, బీజేపీ నేతలకు రాష్ట్ర పదవులు వచ్చేవా? అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు మంత్రి పదవుల్లో ఉన్న వారు ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో ఉన్న వారేనని.. అప్పట్లో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఆంధ్రకు రూ.6 వేల కోట్లు తీసుకెళ్తే తెలంగాణకు రూ.వంద కోట్లు తీసుకురాలేని అసమర్థులుగా మిగిలారని ఎద్దేవాచేశారు. పదవులు కోసం వారు తెలంగాణకు ద్రోహం చేస్తే.. కేసీఆర్ పదవులను త్యజించి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని కొనియాడారు. 24 గంటల కరెంట్ ఇవ్వడానికి ఎప్పుడూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెనుకాడలేదని స్పష్టంచేశారు. ఇప్పుడు మంత్రులు స్వయంగా కరెంట్ కోతలు ఉంటాయని ప్రకటిస్తున్నారని చెప్పారు. 420 హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేసారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, నేతలు భద్రారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఎంపీపీలు ఎల్లుబాయి, హారిక, జడ్పీటీసీ సభ్యులు అనిత తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ

రేపు ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం

పార్టీ ఎమ్మెల్యేలందరికీ ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. తుంటికి ఆపరేషన్ కావడంతో డాక్టర్ల సూచన మేరకు కేసీఆర్ గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల కర్ర సాయంతో నడవగలుగుతున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించారు.

తప్పుడు ప్రచారంతోనే కాంగ్రెస్‌కు అధికారం

మేము చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం: మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 30: తప్పుడు ప్రచారంతో, అమలు సాధ్యంకాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు జిల్లా ఎంతో అభివృద్ధి సాధించిందని.. కానీ, ప్రజలకు వివరంగా చెప్పలేకపోయామని పేర్కొన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు అని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కర్ణాటకలో కూడా ఇలాగే కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. ప్రజాపాలన పేరుతో తీసుకున్న దరఖాస్తులను పరిష్కరించలేదని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేశాయని, రాష్ట్రంలో ఎక్కడా కూడా ఇలా జరగలేదని విరుచుకుపడ్డారు. ఐదేండ్లు ఎంపీగా మన్నె ఎన్నో సేవలు అందించారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతి సందర్భంగా తొలుత గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి చంద్రశేఖర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి

- మంత్రి కోమటిరెడ్డిది నియంతృత్వ పోకడ
- సందీప్‌రెడ్డికి తక్షణమే క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్న మంత్రుల వైఖరి గర్హనీయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టండన్న కోమటిరెడ్డి.. తాజాగా యాదాద్రి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై దుర్భాషలాడటం ఆ పార్టీ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం నుంచి బలవంతంగా సందీప్‌రెడ్డిని బయటకు పంపిన తీరును ఖండించారు. అత్యుత్సాహం ప్రదర్శించిన రాచకొండ పోలీసులపై డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు. కోమటిరెడ్డికి ప్రజాస్వామ్యం మీద ఏమాత్రం గౌరవమున్నా జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డికి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	12.0°c	32.2°c
రంగారెడ్డి	12.4°c	34.7°c
మెదక్	14.2°c	32.7°c
హైదరాబాద్	17.1°c	30.3°c
నల్లగొండ	17.2°c	33.2°c
నిజామాబాద్	17.7°c	32.0°c
వరంగల్	18.0°c	30.0°c
మహబూబ్‌నగర్	18.3°c	32.4°c
కరీంనగర్	19.0°c	31.0°c
ఖమ్మం	31.0°c	17.0°c

నియామకాలు మావి హడావుడి వారిది

మొదటిపేజీ తరువాయి...

పోస్టులకు 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేసిందని, వీటికి మరో 1,890 పోస్టులను కలుపుతూ 2023 జూన్ 22న ఉత్తర్వులు జారీ చేసిందని, దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగిందని గుర్తుచేశారు. ఆయా ఉద్యోగాల భర్తీకి 2023 ఆగస్టు 2న పరీక్ష నిర్వహించామని, తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చిందని చెప్పారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్టాఫ్ నర్సు నియామకాలను తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఏడాదిలోగా 2 లక్షల పోస్టులను భర్తీ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆమోదించి, అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేకుండా, ఏడాదిలోపే అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని, గతంలో ప్రారంభించిన నియామకాల ప్రక్రియను వాటి షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ పేరిట పత్రికల్లో ప్రకటనలు విడుదల చేసిందని గుర్తుచేశారు. దానిప్రకారం ఫిబ్రవరి 1న గ్రూప్ 1 నోటిఫికేషన్, ఏప్రిల్ 1న గ్రూప్ 2, జూన్ 1న గ్రూప్ 3,4 నోటిఫికేషన్, మార్చి1న పోలీసు తదితర యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఎదురుచూస్తున్న ఉద్యోగ అభ్యర్థులకు, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

నర్సింగ్ ఆఫీసర్లకు శుభాకాంక్షలు

స్టాఫ్‌నర్సులుగా ఎంపికై బుధవారం నియామకపత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల మన్ననలు పొందేలా అత్యుత్తమ సేవలందించి, ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. మొత్తం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డును అభినందించారు. నర్సు పోస్టుల పేరును ప్రత్యేకంగా జీవో విడుదల చేసి నర్సింగ్ ఆఫీసర్లుగా ఉన్నతీకరించినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్టాఫ్‌నర్సులుగా పరిగణించడం శోచనీయమని పేర్కొన్నారు.

కోమటిరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో

- వీధి రౌడీల్లా మంత్రి వెంకట్‌రెడ్డి ప్రవర్తన
- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్, జనవరి 30 : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమంలో వీధి రౌడీలా ప్రవర్తించడాన్ని ప్రజలంతా చీదరించుకుంటున్నారని బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీబీనగర్ మండలం గూడూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని చులకన చేసి మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. 75 ఏండ్లలో ఎంతోమంది మంత్రులు వచ్చారని, వారెవరూ ఇలా మాట్లాడలేదని పేర్కొన్నారు. గ్యారెంటీల అమలుపై ప్రశ్నించినందుకు మంత్రిననే సోయి లేకుండా జడ్పీ చైర్మన్‌ను నిందించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. జడ్పీ చైర్మన్‌కు ప్రోటోకాల్ ఉంటుందని, దాన్ని మరిచి పోలీసులను అడ్డం పెట్టుకొని.. ‘లాగేయండి.. కేసులు పెట్టండి’ అంటూ అరాచకం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎలిమినేటి మాధవరెడ్డి, ఉమా మాధవరెడ్డి మచ్చలేని నాయకులని, ఎంతో హుందాగా పాలన సాగించారని, అలాంటి కుటుంబానికి చెందిన సందీప్‌పై ఇలాంటి చర్యను ప్రజలంతా చీదరించుకుంటున్నారని అన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులతో ఏకమై గూండాయిజం చేస్తారా? అని ప్రశ్నించారు.

లంకె బిందెలు కోసం వచ్చేది దొంగలే..

లంకె బిందెలు ఉన్నాయని వచ్చామని, ఇక్కడ మట్టి కుండలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, లంకె బిందెల కోసం దొంగలు మాత్రమే వస్తారని బడుగుల వ్యాఖ్యానించారు. పాలకులు ప్రజాసేవ పేరుతో లంకెబిందెలు దెవులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చర్యలతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభావం తప్పదని హెచ్చరించారు. సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ సందీప్‌పై దాడిని జడ్పీ చైర్మన్‌లంతా ఖండిస్తున్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ దౌర్జన్యకాండ!

మొదటిపేజీ తరువాయి...

చేయడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, కార్యకర్తలను బెదిరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉమ్మడి నల్లగొండలో కాంగ్రెస్ నేతల తీరు దారుణంగా ఉన్నదని మండిపడ్డారు. ఇటీవల హుజూర్‌నగర్ పరిధిలోని చింతలపాలెం మండలం కిష్టాపురంలో జడ్పీటీసీ, ఎంపీటీసీలపై దౌర్జన్యం చేశారని గుర్తుచేశారు. మఠంపల్లి మండలంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడిపై, అతని వ్యవసాయ మోటర్లు తదితర ఆస్తులు ధ్వంసం చేశారని మండిపడ్డారు. భూపాలపల్లి, మానకొండూరు, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో భౌతిక దాడులు, హత్యలు, హత్యాయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాజాగా మంత్రి కోమటిరెడ్డి సమక్షంలో, ఆయన రెచ్చగొట్టడం వల్ల భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని దుర్భాషలాడి, దాడికి పాల్పడి, సమావేశం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు గెంటి వేయడం దారుణమని తెలిపారు. సందీప్‌రెడ్డిపై దాడి జరుగుతుంటే పోలీసులు వ్యవహరించిన తీరు జుగుప్సాకరమని, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనిన్నారు కార్యక్రమంలో నల్లగొండ జడ్పీ చైర్‌పర్సన్లు బండా నరేందర్‌రెడ్డి, గుజ్జా దీపిక, తీగల అనిత, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, పైళ్ల శేఖర్‌రెడ్డి, కోరుకంటి చందర్, శానంపూడి సైదిరెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రావుల శ్రీధర్‌రెడ్డి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అహంకారికి తగిన బుద్ధి చెప్తాం

ఇది నాపై జరిగిన దాడి కాదు. రాజ్యాంగంపై జరిగిన దాడి. మంత్రి కోమటిరెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నాడు. ఇక నుంచి నాయకులపై కాదు కదా.. కార్యకర్త మీద దాడులు జరిగినా ఉపేక్షించబోం.

– ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జడ్పీ చైర్మన్, యాదాద్రి భువనగిరి జిల్లా

మంత్రి కోమటిరెడ్డి తీరుపై నిరసనలు

నల్లగొండ, బొమ్మలరామారంలో దిష్టిబొమ్మ దహనం

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ, జనవరి 30: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. బీబీనగర్‌లో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని కాంగ్రెస్ కార్యకర్తలతో దాడి చేయించడంతో పాటు కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నల్లగొండలో మంత్రి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి, మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు కోమటిరెడ్డికి లేదని అన్నారు.

జడ్పీటీసీ.. నువ్ మాట్లాడొద్దు

- బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెప్తుండగా కాంగ్రెస్ నేతల అభ్యంతరం
- మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలోనే హస్తం పార్టీ నాయకుల అడ్డగింత



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్ వేదికపై ఉండగానే జడ్పీటీసీ లక్ష్మణ్‌రావును మాట్లాడొద్దని వారిస్తున్న కాంగ్రెస్ కార్యకర్త

ఎల్లారెడ్డిపేట, జనవరి 30: బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై మాట్లాడితే చాలు.. అధికార కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం చెప్తున్నారు. పొన్నం ప్రభాకర్ మంత్రి అయ్యాక మంగళవారం తొలిసారి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా దుమాలలో ఏర్పాటు చేసిన సభలో జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రగతి ప్రాంగణాన్ని గొప్పగా నిర్మించారని బీఆర్‌ఎస్ సర్కారు చేసిన అభివృద్ధిని చెప్తుండగా.. ఓ కాంగ్రెస్ కార్యకర్త ‘జడ్పీటీసీ నువ్ మాట్లాడొద్దు’ అంటూ అభ్యంతరం తెలిపారు. గత పదేండ్లలో బాగా అభివృద్ధి జరిగిందని, అదే అభివృద్ధిని కొనసాగించాలని తాను కోరినట్టు జడ్పీటీసీ తెలిపారు. ఇదే క్రమంలో ఎంపీపీ పిల్లి రేణుకకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని, ఆడిబిడ్డను నారాజ్ చేయొద్దని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకుని కలెక్టరేట్‌లో సమావేశం ఉన్నందున ఎంపీపీకి మైక్ ఇవ్వలేదని తెలిపారు. ఎంపీపీ పిల్లి రేణుక మాట్లాడుతూ.. తనకు అందరూ చిరకాల మిత్రులేనని, అందరినీ కలుపుకుపోయి అభివృద్ధి పనులు కొనసాగిస్తానని పేర్కొన్నారు. కాగా, అధికారిక కార్యక్రమానికి సంబంధించి వేదికపైకి మంత్రితోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆహ్వానించడం గమనార్హం. ఇక్కడ ఎంపీపీని వేదికపైకి ఆహ్వానించకపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

నాల్కోలో

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్‌ఏఎల్‌సీవో) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు : 42
- పోస్టులు: జూనియర్ ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్, గ్రేడ్–III ల్యాబొరేటరీ అసిస్టెంట్–2 డ్రెస్సర్–కమ్–ఫస్ట్ ఎయిడ్, గ్రేడ్–III నర్స్
- అర్హత: ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, హెచ్‌ఎస్సీ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 18
- వెబ్‌సైట్ : https://nalcoindia.com/

పీఎంబీఐలో...

ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ ఆఫ్ ఇండియా (పీఎంబీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్
- విభాగాలు: లీగల్, క్వాలిటీ కంట్రోల్, ఐటీ అండ్ ఎంఐఎస్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ: ఫిబ్రవరి 7 నుంచి 12 వరకు
- వెబ్‌సైట్: www.janaushadhi.gov.in

తిరుపతి ఐఐటీలో

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, గ్రేడ్–1 అసిస్టెంట్ ప్రొఫెసర్ , గ్రేడ్–2 అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్)
- విభాగాలు: కెమికల్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటీరియల్ సైన్స్ ఇంజినీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్
- అర్హతలు: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, అనుభవం ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్
- చివరితేదీ: ఫిబ్రవరి 29
- వెబ్‌సైట్: https://iittp.ac.in/

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- సైకాలజీ, ఫిజిక్స్, పాలిటీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.